సాక్షి కామారెడ్డి
శనివారం । 15 । జూన్ । 2024



నాణ్యమైన విత్తనాలు అమ్మాలి

రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని టాస్క్‌ఫోర్స్ అధికారులు సూచించారు. శుక్రవారం జిల్లాలో తనిఖీలు చేశారు.

- 9లో ▸



తల్లి మందలించిందని..

తల్లి మందలించిందని ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కిన ఘటన నస్రుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవ్‌పల్లిలో చోటుచేసుకుంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /23.0

వాతావరణం

ఉదయం ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. ఈదురు గాలులు వీస్తాయి. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఐదు స్కూల్ బస్సులు సీజ్



కామారెడ్డి క్రైం: ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న ఐదు స్కూల్ బస్సులను సీజ్ చేసినట్లు జిల్లా ఇన్‌చార్జి రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టామని వెల్లడించారు. ఈ సందర్భంగా వాహనాల ఫిట్‌నెస్, ఇతర ధృవపత్రాలను పరిశీలించడం జరిగిందన్నారు. వాటిలో సరైన ధ్రువపత్రాలు, ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్న ఐదు పాఠశాల బస్సులను సీజ్ చేశామన్నారు. క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తామని, ప్రతి పాఠశాల బస్సుకు ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు.

ఎనిమిదేళ్ల తర్వాత తెరుచుకున్న బడి



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లి(జి)లో 8 ఏళ్ల క్రితం పిల్లలు లేరని మూసివేసిన పాఠశాల తిరిగి తెరుచుకుంది. గ్రామస్తులు తమ పిల్లలను బడిలో చేర్పించడంతో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేసి తరగతుల నిర్వహణ మొదలు పెట్టారు. పిచ్చి మొక్కలు, దుమ్ముధూళితో ఉన్న పాఠశాలను శుభ్రం చేశారు. గతంలో విద్యార్థులు తక్కువగా ఉన్నారని పాఠశాలను మూసివేయగా తాజాగా తిరిగి తెరుచుకోవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వారికి దేవుడే దిక్కు!

- పిట్లం ఆస్పత్రి భవనంలో పెచ్చులూడి పడుతున్న పైకప్పు
- 30 పడకల ఆస్పత్రికి 'డెంటల్' డాక్టర్ ఒక్కరే..
- బిచ్కుందలో పేరుకే వంద పడకల ఆస్పత్రి
- ఉన్నది కేవలం ఒక్క ఇన్‌చార్జి డాక్టరే..
- జుక్కల్ ముప్పై పడకల ఆస్పత్రిదీ అదే పరిస్థితి



పిట్లంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్

సాక్షి ఫోకస్

సాక్షి, కామారెడ్డి: మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న జుక్కల్ నియోజకవర్గంలో సర్కారు వైద్యం పడకేసింది. అక్కడి ఆస్పత్రులను పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో పేదలకు వైద్యం అందడం లేదు. వెనుకబడిన ప్రాంతం దానికి తోడు పేదరికం ఎక్కువగా ఉన్న జుక్కల్ ప్రాంతంలో వైద్య సేవలను మెరుగుపరిచే ఉద్దేశంతో భవనాలు నిర్మించి స్థాయి పెంచినా, వైద్యులు, సిబ్బంది లేకపోవడం ఆ ప్రాంత ప్రజలకు శాపంగా మారింది. జుక్కల్, బిచ్కుంద, పిట్లం, మద్నూర్ మండల కేంద్రాల్లోని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పేదలకు వైద్యం పగటికలగానే మిగిలింది. ప్రభుత్వాలు రూ. కోట్లు ఖర్చు చేస్తున్నా, ప్రజలు వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. భవనాలు ఉన్న చోట వైద్యులు, సిబ్బంది లేరు. కూల్చివేత జాబితాలో ఉన్న శిథిల భవనంలోనే ఆస్పత్రులు నడపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అందుకే ఇక్కడ రోగులు తమకు దేవుడే దిక్కు అంటున్నారు.



ఇక్కడ పేరుకే ఎక్స్‌రే రూం.. సిబ్బంది లేరు

వైద్యులు లేని వంద పడకల ఆస్పత్రి..

బిచ్కుందలోని సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. కానీ అది రికార్డుల్లో మాత్రమే ఉంది. అయితే వంద పడకల ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కలిపితే 119 మంది ఉండాలి. ఇక్కడ ఒక్కరంటే ఒక్క వైద్యుడు లేడు. మద్నూర్ సీహెచ్‌సీ వైద్యుడిని ఇన్‌చార్జీగా పంపించారు. ఆయన వస్తేనే వైద్యం.. లేదంటే అక్కడి సిబ్బంది ఇచ్చే మందులు తీసుకువెళ్లాల్సిందే. వంద పడకల ఆస్పత్రిలో 11 మంది సివిల్ సర్జన్‌లు, ఒక ఆర్‌ఎంవో, ఏడుగురు డిప్యూటీ సివిల్ సర్జన్లు, 25 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, ఒక డెంటల్ అసిస్టెంట్ సర్జన్, 26 మంది స్టాఫ్ నర్సులతో పాటు మొత్తంగా 119 మంది ఉండాలి. కానీ ఒక్క డాక్టర్ కూడా లేకపోవడం విచిత్రం. ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్ ఏర్పాటు చేసినా ఇప్పటికీ దాన్ని వినియోగించే పరిస్థితి లేదు. ఎందుకంటే సిబ్బంది లేరు.



నిలిచిపోయిన భవన నిర్మాణం

అర్ధాంతరంగా నిలిచిన పిట్లం ఆస్పత్రి భవనం పనులు

పిట్లం మండల కేంద్రంలో 1982లో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలోనే సీహెచ్‌సీ నడుస్తోంది. దీన్ని ముప్పై పడకల ఆస్పత్రి అంటారు. భవనం శిథిలావస్థకు చేరి, పెచ్చులూడి పడుతున్నాయి. ఆస్పత్రికి వచ్చే రోగులే కాదు, అక్కడ పనిచేసే సిబ్బంది కూడా భయంతో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి. సీహెచ్‌సీ భవనానికి నిధులు మంజూరై, భవన నిర్మాణ పనులు చేపట్టారు. రెండంతస్తులకు సంబంధించి స్లాబు వేసి వదిలేశారు. భవన నిర్మాణం ఆగిపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితుల్లో ఉన్న పాత భవనంలోనే ఆస్పత్రి కొనసాగుతోంది. ఓ గదిలో పైకప్పు పెచ్చులూడగా.. మరో గదిలో పెచ్చులు పడకుండా స్లాబుకు బట్టను కట్టి కాపాడుతున్నారు. ఇంకో గదిలో వర్షపు నీరు వచ్చి చేరుతోంది. విలువైన వైద్య పరికరాలు, మందులకు రక్షణ లేకుండాపోయింది. ముప్పై పడకల ఆస్పత్రిగా పేర్కొంటున్నప్పటికీ పడకలు లేవు. అందుకు కావాల్సిన వైద్యులు, సిబ్బంది సంగతి దేవుడెరుగు. ఇక్కడ నలుగుడు డిప్యూటీ సివిల్ సర్జన్లు, 12 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, ఒక డెంటల్ అసిస్టెంట్ సర్జన్, ఇద్దరు హెడ్ నర్సులు, పది మంది స్టాఫ్ నర్సులు, మరో 13 మంది సిబ్బంది అవసరం ఉంటుంది. అయితే ఇక్కడ ఉన్నది ఒక్క డెంటల్ డాక్టర్ మాత్రమే. ఆయన అప్పుడప్పుడు వచ్చి వెళుతుంటారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఏ రోగమొచ్చినా డెంటల్ డాక్టర్ చూడాల్సిందే. లేదంటే అక్కడ పనిచేసే సిబ్బంది వచ్చిన రోగులకు మందులు ఇచ్చి పంపుతుంటారు.



పిట్లం ఆస్పత్రిలో పెచ్చులూడిన దృశ్యం

జుక్కల్ ఆస్పత్రి ఎవరి పరిధిలో ఉందో..!



జుక్కల్‌లో రూర్బన్ నిధులతో 30 పడకల ఆస్పత్రిని నిర్మించారు. గతంలో పీహెచ్‌సీ కింద ఉన్న సిబ్బంది, వైద్యుడే ఈ ఆస్పత్రిలో పని చేస్తున్నారు. 30 పడకల ఆస్పత్రిలో నలుగురు డిప్యూటీ సివిల్ సర్జన్లు, 12 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, ఒక డెంటల్ అసిస్టెంట్ సర్జన్, ఇద్దరు హెడ్ నర్సులు, పది మంది స్టాఫ్ నర్సులు, మరో 13 మంది సిబ్బంది అవసరం ఉంటుంది. సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆస్పత్రులు వైద్య విధాన పరిషత్ ఆధీనంలో పనిచేయాల్సి ఉంటుంది. కానీ జుక్కల్ ఆస్పత్రి వైద్య విధాన పరిషత్ ఆధీనంలో ఉందో, వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఉందో అధికారులకే అర్థం కాని పరిస్థితి నెలకొంది. జుక్కల్ ఆస్పత్రికి రూర్బన్ నిధులతో భవనం నిర్మించినా, వైద్యులు, సిబ్బంది లేకపోవడం ఈ ప్రాంత ప్రజలకు శాపంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి జుక్కల్ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

'ప్రాణహిత' పనులు పూర్తి చేయిస్తా



ఇరిగేషన్ అధికారులతో సమీక్షిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్ట్ 20, 21, 22 ప్యాకేజీ పనులు పూర్తి చేయించడమే తన లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా రైతులకు 2.75 లక్షల ఎకరాలకు సాగునీరందించడమే ధ్యేయంగా దివంగత నేత వైఎస్సార్ హయాంలో పనులు ప్రారంభించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్, ఈఈ మల్లేశ్, పోచమ్మ బృందంతో సమీక్షించి పనులు జరిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. త్వర లో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులతో రివ్యూ మీటింగ్ ఉందని తెలిపారు. రూ. 400 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తే ప్రాణహిత చేవెళ్ల పనులు ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు. నిధులు మంజూరు చేయించి పని పూర్తి చేయిస్తానని చెప్పారు.

జిల్లాలో మొదలైన ఎన్‌హెచ్ 765డి హైవే విస్తరణ పనులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా సరిహద్దులో గల నాగిరెడ్డిపేట మండలంలో పోచారం మూలమలుపు వద్ద శుక్రవారం ఎన్‌హెచ్765డి హైవే విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. బాల్‌నగర్ నుంచి మెదక్ వరకు మొదటి విడతలో హైవే అథారిటీ అధికారులు రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేశారు. ప్రస్తుతం రెండో విడతలో మెదక్ నుంచి రుద్రూర్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందులో భాగంగా శుక్రవారం పోచారం సమీపంలోని మూలమలుపు వద్ద రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు.

అటవీ శాఖ అధికారులపై దాడి



గాయపడిన వారిని పరామర్శిస్తున్న ఎఫ్‌డీవో సుధాకర్‌రావు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కాల్పోల్‌లో అటవీ భూమిని దున్నుతుండగా అడ్డుకునేందుకు యత్నించిన ఫారెస్ట్ అధికారులపై గ్రా మస్తులు శుక్రవారం దాడికి పాల్పడ్డారు. గ్రామస్తు లు, పోలీసులు, అటవీశాఖ అధికారుల కథనం ప్ర కారం.. కాల్పోల్‌కు చెందిన మోతీలాల్ కుటుంబం అటవీ భూమిని ట్రాక్టర్‌తో దున్నుతుంది. విషయం తెలుసుకున్న నిజామాబాద్ సౌత్ ఎఫ్ ఆర్‌వో రాధిక ఆధ్వర్యంలో సెక్షన్ ఆఫీసర్ సాయికృష్ణ, బీట్ ఆఫ్ సర్ ప్రగతీకుమార్, ప్రసాద్, బేస్ క్యాంపు సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అటవీ భూమి ని ఎందుకు దున్నుతున్నారని ప్రశ్నించడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మోతీలాల్ కుటుంబం గ్రామస్తులకు ఫోన్ చేయడంతో సుమారు 40 మంది వరకు అక్కడికి చేరుకున్నారు. పరిస్థితి అదుపు తప్పే అవకాశముందని గ్రహించిన రాధిక స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. వీడియో చిత్రీకరిస్తుండగా ఎఫ్ఆర్‌వోతో పాటు అటవీ శాఖ సిబ్బంది ఫోన్లను గ్రామస్తులు లాక్కున్నారు. ట్రాక్టర్‌ను పట్టు కునేందుకు యత్నించిన ఎఫ్ఆర్‌వో, సెక్షన్ ఆఫీసర్ సాయికృష్ణపై దాడికి పాల్పడ్డారు. సుమా రు 200 మీటర్ల వరకు రాధికను వెంబడించారు. ఈ దాడిలో ఎఫ్ఆర్‌వో, సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్లకు గాయాలయ్యాయి. అటవీ అధికారులు తమపై దాడికి పాల్పడిన కాల్పోల్ గ్రామస్తులు, గిరిజనులపై పోలీసులకు ఫిర్యాదుచేశారు. సీఐ సురేష్‌కుమార్, ఎస్సై గంగాధర్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా గ్రామస్తులు, గిరిజనులు పరారయ్యారు.



కాల్పోల్‌లో అటవీ అధికారులపై దాడికి యత్నిస్తున్న గ్రామస్తులు

ధరణి సమస్యలను పరిష్కరించాలి

- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్
- సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కామారెడ్డి క్రైం: మరోసారి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆయా జిల్లాల కలెక్టర్లకు సూచించారు. హైదరాబాద్ నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల కోడ్‌కు ముందు మార్చి నెల 1 ఒకటి నుంచి 15 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ ఎక్కువగా ఉన్న మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించాలని కలెక్టర్లకు సూచించారు. ధరణి వెబ్‌సైట్‌కు సంబంధించి జీఎల్ఎం, టీఎం 33 దరఖాస్తుల్లో డిజిటల్ సంతకాల ప్రక్రియకు మార్పులు చేస్తున్నామని తెలిపారు. కొన్ని సమస్యలు తహసీల్దార్, మరికొన్ని ఆర్డీవో, ఇంకా కొన్నింటిని కలెక్టర్ స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో వచ్చే భూసంబంధిత సమస్యలను సైతం కలెక్టర్లకు బదిలీ చేయడం జరుగుతుందన్నారు. వాటిని అత్యంత ప్రాధాన్యతతో వెంటనే పరిష్కారమయ్యేలా చూడాలని పేర్కొన్నారు. ప్రతి మండలంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటుకు అనువైన భవనం లేదా భూమిని గుర్తించి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్లకు సూచించారు.

త్వరగా పూర్తిచేయాలి

కాన్ఫరెన్స్ అనంతరం కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్ జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీసీ ద్వారా మాట్లాడారు. కామారెడ్డి జిల్లాలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలన్నారు. సీసీఎల్ఏ కమిషనర్ సూచనల ప్రకారం వీలైనంత త్వరగా పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలని ఆయా మండలాల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ అదనపు చంద్రమోహన్, ఆర్డీవోలు రంగనాథరావు, ప్రభాకర్, రమేశ్ రాథోడ్, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకు ఎదుట రైతుల ఆందోళన

- భూములు వేలం వేస్తే ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరిక
- బ్యాంకు అధికారులపై మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఆగ్రహం
- దీర్ఘకాలిక రుణాలపై వడ్డీ మాఫీ చేయాలని డిమాండ్



లింగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు వద్ద ధర్నా చేస్తున్న రైతులు

లింగంపేట(ఎల్లారెడ్డి): అప్పు వసూళ్ల కోసం బ్యాంకు అధికారులు రైతుల భూములను వేలం వేస్తామంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. లింగంపేట మండలం పోల్కంపేటలో వ్యవసాయ భూమిలో బ్యాంకు అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన విషయంపై 'సాక్షి' మెయిన్‌లో 'రైతు భూమిలో బ్యాంకు ఫ్లెక్సీ' శీర్షికన ప్రచురితమైన విషయం తెలిసిందే. భూమిని వేలం వేస్తామంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై ఆగ్రహించిన రైతులు శుక్రవారం లింగంపేటలోని బ్యాంకు ముందు ఆందోళనకు దిగారు. వారికి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మద్దతు తెలిపారు. ఫ్లెక్సీలు, ఎర్రజెండాలు తొలగించకపోతే తాము ఆత్మహత్యలకు కూడా వెనకాడమని రైతులు హెచ్చరించారు. రైతుల ధర్నాకు మద్దతు పలికిన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. దేశానికి అన్నంపెట్టే రైతుల భూములను వేలం వేస్తామంటూ ఫ్లెక్సీలు, ఎర్రజెండాలు పాతే అధికారం ఎవరిచ్చారని మండిపడ్డారు. గత పదేళ్లలో ఎప్పుడైనా రైతులు రోడ్లమీదికి వచ్చిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన ఆరు నెలలకే రైతులను రోడ్లమీదికి తెచ్చారని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా భేషరతుగా రైతుల భూముల్లో ఫ్లెక్సీలు, ఎర్రజెండాలు తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. రైతులు తీసుకున్న రుణాల వడ్డీలు మాఫీ చేసి అసలు డబ్బులు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకు మేనేజర్ కుమారస్వామిని వివరణ కోరగాపై అధికారుల ఆదేశాల మేరకు రుణాలు చెల్లించని రైతుల భూములను వేలం వేయడానికి నిర్ణయించినట్లు వెల్లడించారు. రైతుల ఆందోళన విషయాన్ని పైఅధికారులకు వివరించి వారి ఆదేశానుసారం నడుచుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్, పట్టణాధ్యక్షుడు సాయిరాం, యూత్ అధ్యక్షుడు నరేశ్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, గన్నూనాయక్, పర్వయ్య, మహిపాల్‌రెడ్డి, పలు గ్రామాల రైతులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, సందీప్, లక్ష్మణ్, మంగ్యానాయక్, సంజీవరెడ్డి, భాస్కర్, భీమయ్యతో పాటు 100 మంది రైతులు పాల్గొన్నారు.

అంతటా 'సాక్షి' కథనంపైనే చర్చ

పోల్కంపేటలో అప్పు చెల్లించని రైతు భూమిని వేలం వేస్తామటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన విషయంపై శుక్రవారం 'సాక్షి' మెయిన్ పేజీలో ప్రచురితమైన కథనం అందరినీ కదిలించింది. బడాబాబులను వదిలి రైతులపై జబర్దస్తీ చేస్తున్న బ్యాంకు అధికారులపై ఆగ్రహం వ్యక్తమైంది. రైతులు చెల్లించాల్సిన అప్పులపై వడ్డీలు అడ్డగోలుగా వేసి ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లింగంపేట మండలంలో వందలాది మంది రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి రుణాలపై వడ్డీని తగ్గించి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

జిల్లా కేంద్రంలో నీటిగోస

- పలు కాలనీల్లో తీవ్రంగా నీటిఎద్దడి
- పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం
- అవస్థలు పడుతున్న జనం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణ ప్రజల నీటి కష్టాలు తీరడం లేదు. అభివృద్ధి పేరిట రూ. లక్షలు వెచ్చిస్తున్నా సమయానికి నీరందడం లేదు. ఇప్పటికీ చాలా కాలనీల్లో తీవ్ర నీటిఎద్దడి నెలకొంది. వారానికోసారి మాత్రమే కుళాయిల్లో నీరు వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు, ప్రజా ప్రతినిధులెవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారం కావడం లేదు. సరైన ప్రణాళిక లేని మున్సిపల్ యంత్రాంగం పనితీరుతో జనం అవస్థలు పడుతున్నారు.

వారానికోసారి మాత్రమే..

జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత కామారెడ్డి వేగంగా విస్తరిస్తోంది. పట్టణంలో లక్షకు పైగా జనాభా ఉంది. ప్రతి వేసవిలో విద్యానగర్, అశోక్ నగర్, శ్రీరాంనగర్, వివేకానంద కాలనీ, బతుకమ్మకుంట, రుక్మిణి కుంట, ఇస్లాంపుర, గొల్లవాడ, హరిజనవాడ, గాంధీనగర్, రాజీవ్‌నగర్, వాంబే, డ్రైవర్స్ కాలనీల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంటుంది. పట్టణంలో నెలకొన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ప్రస్తుత ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గతంలో మంత్రిగా ఉన్న సమయంలో గోదావరి జలాల పథకాన్ని తీసుకువచ్చారు. దాదాపు రూ. 262 కోట్లతో శ్రీరాంసాగర్ నుంచి ప్రత్యేకంగా పైప్‌లైన్ వేయించి కామారెడ్డికి గోదావరి జలాలను తీసుకువచ్చారు. అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగా పైప్‌లైన్ల ఏర్పాటులో నాణ్యత లోపించింది. 15 ఏళ్లుగా నిత్యం ఎక్కడో ఓ చోట పైప్‌లైన్ లీకేజీలు జరుగుతూనే ఉన్నాయి. దాంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతూనే ఉంది. గోదావరి జలాల పైప్‌లైన్లు తరచుగా లీకేజీలకు గురవుతుంటాయి. వాటి నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొన్ని కాలనీలకు వారానికోసారి మాత్రమే నీరందుతోంది. ఆయా కాలనీల్లో ఉన్న పదుల సంఖ్యలో మున్సిపల్ బోర్లు చెడిపోయి మరమ్మతులకు నోచుకోవడం లేదు. గోదావరి జలాలు రాక, బోరు మోటార్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.



పట్టణంలో నీటిని విక్రయించే ఓ ట్యాంకర్

ట్యాంకర్లే దిక్కు..

జిల్లా కేంద్రాన్ని రెండుగా విభజిస్తే, కామారెడ్డి పెద్ద చెరువు నుంచి ఉన్న పైప్‌లైన్లు, బుర్ర మత్తడి బోరు బావుల నుంచి పైప్‌లైన్ల ద్వారా పాత పట్టణానికి నీరందుతుంది. గోదావరి జలాల పైప్‌లైన్ల ద్వారా కొత్త పట్టణానికి నీరందిస్తున్నారు. ఇవి కాకుండా ఆయా కాలనీల్లో దాదాపు వందకు పైగా మున్సిపల్ బోరు బావులున్నాయి. వేసవిలో నీటిఎద్దడి నివారణకు బల్దియా ఆధ్వర్యంలో చేపట్టిన చర్యలు అంతంత మాత్రమే. అందుకే కమ్యూనిటీ బోర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వ్యాపార సముదాయాలు, బోరుబావుల్లో నీరు ఇంకిపోయిన వారికి ట్యాంకర్లతో నీటిని కొనుక్కోవడమే దిక్కవుతుంది. ఒక్కో ట్యాంకర్ నీటిని రూ. 600 వరకు విక్రయిస్తున్నారు. దీంతో సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదు. పైప్‌లైన్లు, బోరు మోటార్ల మరమ్మతులు చేయించి పట్టణంలో నీటిఎద్దడిని పరిష్కరించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



కాలనీలో చాలామంది ఇళ్లలో బోర్లు ఎత్తిపోయాయి. గోదావరి నీళ్ల క్రమం తప్పకుండా వదలాలి. ఇష్టం వచ్చినపుడు వదులుతున్నారు. నీళ్ల రాక ఇబ్బందులు పడుతున్నాం. ట్యాంకర్ల ద్వారా నీళ్ల తెప్పించుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించాలి.

– చిరంజీవి, న్యాయవాది, శ్రీరాంనగర్ కాలనీ

చర్యలు తీసుకుంటున్నాం



నీటి ఎత్తడి నివారణకు చర్యలు చేపడుతున్నాం. ఆరు ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా నీటి సమస్య తీవ్రంగా ఉన్న కాలనీల్లో సరఫరా చేయిస్తున్నాం. చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేయిస్తున్నాం. ఇబ్బందులు లేకుండా చూసుకుంటాం.

– సుజాత, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి

క్లుప్తంగా

టీఎన్జీవో ప్రతినిధులకు సన్మానం



కామారెడ్డి అర్బన్ : టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ముజీబ్‌ను, అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను శుక్రవారం సన్మానించినట్లు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి సాయిలు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల అభిప్రాయం మేరకు కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా ముజీబ్‌ను ఎన్నుకున్న అనంతరం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళ్లు అర్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, కేంద్ర సంఘ బాధ్యుడు ఎం.నాగరాజు పాల్గొన్నారు.

ఈద్గాను సందర్శించిన చైర్‌పర్సన్



కామారెడ్డి టౌన్ : ఈద్గా పండగ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని కోర్ట్ రోడ్ లోని ఈద్గాను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ శుక్రవారం సందర్శించారు. ఏర్పాట్లు, పనులను పరిశీలించారు. పండగ సందర్భంగా ప్రార్థనలు జరుపుకునేందుకు కావాల్సిన టెంట్‌లు, తాగునీరు ఇతర సౌకర్యాలు అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలోని కౌన్సిలర్లు శివకృష్ణమూర్తి, చాట్ల రాజేశ్వర్, వంశీ, నాయకులు గడ్డం చంద్రశేకర్‌రెడ్డి, ఉర్దోండ రవి, పంపరి శ్రీనివాస్, లక్ష్మినారాయణ తదితరులున్నారు.

ఈదురు గాలులకు కూలిన చెట్టు



రాజంపేట : మండల కేంద్రంలోని బాలుర ఉన్న పాఠశాల ప్రాంగణ పరిధిలోని చెట్టు ఈదురుగాలులకు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ప్రధాన రోడ్డు నుండి పాఠశాల వెనక నుండి కాలనీ వెళ్లాలంటే కాలనీవాసుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ పాలక వర్గం రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కానిస్టేబుళ్లకు సన్మానం



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలో చాలా రోజులుగా విధులు నిర్వహించి శుక్రవారం బదిలీపై వెళ్తున్న ఐదుగురు కానిస్టేబుళ్లను ఎస్సై లావణ్య సన్మానం చేశారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్ల సుభాష్, ప్రమోద్ రెడ్డి, రఘు, ఖాజా పాషా, మహిబీన్ సేవలు మరవలేనివన్నారు. ఈ కార్యక్రమంలో తోటి సిబ్బంది ఏఎస్సై వెంకట్రావ్, కానిస్టేబుల్ సాగర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నస్రుల్లాబాద్: మండలంలోని సంగం గ్రామంలో పేకాటస్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై లావణ్య శుక్రవారం పేర్కొన్నారు. గ్రామంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో దాడిచేసి పది మందిని పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి రూ. 22,600 నగదు, 8 ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై వెంట పోలీసు సిబ్బంది జావీద్, గంగాధర్ ఉన్నారు.

కళాశాల ప్రచార వాహనం ప్రారంభం



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ గంగాధర్

బాన్సువాడ రూరల్ : మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల 2024–25 నుంచి స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదా పొందిన విషయాన్ని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియపర్చాలనే ఉద్దేశంతో ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ తెలిపారు. ఈ ప్రచార వాహనం నిజామాబాద్ జిల్లాలోని చందూరు, మోస్రా, పోతంగల్, కోటగిరి, రుద్రూర్ మండల కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం చేస్తుందన్నారు. కామారెడ్డి జిల్లాలోని గాంధారి, పిట్లం, బీర్కూర్, బిచ్కుంద, డోంగ్లి, జుక్కల్ మద్నూర్‌తో పాటు మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోనూ ప్రచారం చేపడుతామన్నారు. అంతకు ముందు ప్రిన్సిపల్ గంగాధర్, అధ్యాపకులతో కలిసి కళాశాల ప్రచార పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గోపాల్, గిరిధర్, వెంకట్‌రావు, యూనుస్, వెంకట్‌రెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.

సీట్లు పొందిన వారు అడ్మిషన్ తీసుకోవాలి

బాన్సువాడ రూరల్ : మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో దోస్త్ తొలి విడతలో సీట్లు సాధించిన వారు శనివారం అడ్మిషన్ పొందాలని ప్రిన్సిపల్ గంగాధర్ సూచించారు. రెండో విడత దోస్త్ దర ఖాస్తు చేసుకునే వారికి కూడా అవకాశం ఉందన్నా రు. కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. కోర్సుల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు హాస్టల్స్ ఉన్నాయన్నారు.

ఇళ్లలోకి నీళ్లు.. పట్టించుకునేవారెవరు..?

మాచారెడ్డి : మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి డ్రైయినేజీ లేక రోడ్డు పక్క ఇళ్లల్లోకి వరద నీరు వచ్చి స్థానికులు ఇబ్బంది పడ్డారు. మండల కేంద్రంలోని జూనియర్ కాలేజి ముందు నుంచి గజ్యా నాయక్ తండా చౌరస్తా మీదుగా ఘన్ పూర్ స్టేజి వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మించారు. రోడ్డు వేయక ముందే డ్రైయినేజీ కట్టాలన్న ఆలోచన లేక పోవడంతో ఓ మోస్తరు వర్షం కురిసినా ఇళ్లల్లోకి నీళ్ళు చేరుతున్నాయి. వర్షాకాలం ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే ఇంకా ముందు ముందు ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే భయమేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇద్దరు నాయకుల ఆధిపత్య పోరులో డ్రైయినేజీ నిర్మాణం ఆగిపోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాయకుల పాపం స్థానికులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కేవీఆర్, స్థానికుడైన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చొరవ తీసుకొని డ్రైయినేజీ నిర్మాణానికి కృషి చేయాలని కోరుతున్నారు.



గజ్యానాయక్ తండా చౌరస్తాలో ఇంట్లోకి వచ్చిన వర్షం నీళ్లు

అనుబంధ రంగాలను ప్రోత్సహించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కామారెడ్డి క్రైం: రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పాడి పశువులు, చేపల పెంపకంపై దృష్టి సారించేలా ఐకేపీ అధికారులు ప్రోత్సహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మా ట్లాడారు. రైతులు ఫాంపాండ్‌లను నిర్మించుకోవడం ద్వారా తక్కువ పెట్టుబడితో చేపల పెంపకం చేపట్టడమే కాకుండా అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలను ఎంచుకోవడం ద్వా రా అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌చార్జి డీఆర్‌డీవో చందర్ నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, అధికారులు పాల్గొన్నారు.

బాలు, కుషాల్‌కు ఉత్తమ రక్తదాత అవార్డులు



ఉత్తమ రక్తదాత అవార్డు అందుకుంటున్న బాలు



ఉత్తమ రక్తదాత మోటివేటర్‌గా అవార్డు అందుకుంటున్న ఎ కుషాల్

కామారెడ్డి అర్బన్ : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకులు, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాపూర్ కుషాల్ ఉత్తమ రక్తదాతగా అవార్డులను అందుకున్నారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ గవర్నర్ నిలయం రాజ్‌భవన్ సాంస్కృతిక భవన్‌లో ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలు, కుషాల్‌కు రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఉత్తమ రక్తదాత అవార్డు అందజేశారు. బాలుకు వ్యక్తిగత విభాగంలో, కుషాల్‌కు పీఆర్‌టీయూ తరపున మోగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేసి ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయుల రక్తదానం చేసే విధంగా చైతన్యం చేసినందుకు గవర్నర్ అవార్డులను అందజేశారు. గవర్నర్ రాధాకృష్ణన్ స్థానికంగా లేనందున మంత్రి పొన్నం ప్రభాకర్, ఐఏఎస్ అధికారులు క్రిస్టినా జడ్ చొంగ్తు, బుర్రా వెంకటేశం, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ అజయ్‌మిశ్రా చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఎం.రాజన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

భిక్కనూరు: అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని జంగంపల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేట మండల కేంద్రానికి చెందిన పాముల రాజేందర్(45) ఈనెల 11న కామారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన తండ్రికి అవసరమైన రక్తాన్ని ఇచ్చి ఖర్చులకు అవసరమైన డబ్బులు లేవని తన సోదరి మంజులకు చెప్పి ఆస్పత్రి నుంచి బయటకు వచ్చాడు. తిరిగి కనిపించకపోవడంతో కుటుంబీకుల పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం జంగంపల్లి శివారులోని కోళ్ల షెడ్ సమీపంలో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. విచారణలో రాజేందర్ మృతదేహంగా గుర్తించారు. మృతుడి భార్య గోదావరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ సీనియర్ నేత మృతి



ఖలీల్ (ఫైల్)

బోధన్: మండలంలోని కొప్పర్గకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ ఖలీల్ పటేల్ (65) గురువారం అర్ధరాత్రి గుండె పోటుతో మృతి చెందాడు. స్వగ్రామంలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు అంత్యక్రియలకు హాజరయ్యారు. నివాళులు అర్పించిన వారిలో వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, మాజీ ఎంపీపీ గంగాశంకర్, మున్సిపల్, ఏఎంసీ మాజీ చైర్మన్లు మహ్మద్ గౌసొద్దీన్, పాషామొహినొద్దీన్, నాయకులు గణపతి రెడ్డి, అల్లె రమేశ్, మందర్న రవి, కేజీ గంగారాం, భుయ్యన్ సురేశ్ పటేల్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మద్యానికి బానిసై యువకుడి మృతి



పిట్లం: మద్యానికి బానిసై యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని మారేడు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై నీరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాశీరాం(29) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగొద్దని కుటుంబీకులు చెప్పినా వినిపించుకోలేదు. ఈ నెల 13న తన ఆటోలో పిట్లం వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. పిట్లంలో ఉన్న సాయిగార్డెన్ వెనుకాల ఉన్న ప్రాంతంలో మద్యం అతిగా తాగడంతో మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



నిమ్మ శంకర్ మృతదేహం

నిజామాబాద్‌రూరల్: ఖానాపూర్‌లోని అంబేడ్కర్ కాలనీకి చెందిన నిమ్మ శంకర్(68) అనే రైతు శుక్రవారం విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శంకర్ గత ఆరేళ్లుగా ఖానాపూర్ శివారులో భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. గురువారం ఉదయం 9 పొలం వద్దకు వెళ్లి స్టార్ బాక్సు వద్ద కట్ అయిన వైర్‌కు టేపు చుడుతుండగా విద్యుదాఘాతం సంభవించి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఇద్దరి మధ్య ఘర్షణ

- ఒకరి మృతి



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ఇద్దరు వ్యక్తులు గొడవపడిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నాందేడ్‌కు చెందిన సతీశ్‌శర్మ(40), రాజు(45) రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్–1 ప్రాంతంలో గొడవపడ్డారు. ఈ ఘటనలో రాజు సతీశ్‌ను నెట్టేయడంతో ప్లాట్‌ఫాం మీద పడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మూడు స్కూల్ బస్సులు సీజ్

ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్‌నగర్, పులాంగ్ చౌరస్తా వద్ద నిర్వహించిన తనిఖీల్లో సరిగా ఫిట్‌నెస్ లేని మూడు స్కూల్ బస్సులను సీజ్ చేసినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పరిమళ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యాజమాన్యాలు తమ పాఠశాల బస్సులకు తప్పని సరిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలన్నారు. తనిఖీలో ఆర్‌టీవో కిరణ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్‌కు గాయాలు

బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్‌లో విద్యుత్ సరఫరాకు మరమ్మతులు చేస్తుండగా లైన్ మన్ దస్తగిరి విద్యుదాఘాతానికి గురికావడంతో చేతికి తీవ్రగాయమైంది. గ్రామస్తులు చికిత్స నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నవీపేట: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ టిప్పర్‌ను పక్కా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ శుక్రవారం పేర్కొన్నారు. రెంజల్ మండలంలోని సాటాపూర్ నుంచి నిజామాబాద్ వైపు ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా అబ్బాపూర్(ఎం) శివారులో పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. టిప్పర్‌కు రూ. 20 వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గొల్లపేటలో గొడవ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని గొల్లపేట ఇందిరమ్మ కాలనీలో ఇద్దరి మధ్య జరిగిన గొడవ కత్తెరతో దాడికి దారి తీసింది. కాలనీలో నివాసం ఉంటున్న బిట్టుకు, నజీర్‌కు కొంత కాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పాత కక్షలతో ఇద్దరి మధ్య గొడవ మొదలైంది. ఈక్రమంలో బిట్టు కత్తెరతో నజీర్‌పై దాడి చేశాడు. దీంతో నజీర్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొట్టిన ఐచర్ వాహనం



బాల్కొండ: ఆగిఉన్న లారీని ఐచర్ వాహనం ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆర్మూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఐచర్ వాహనం బాల్కొండ మండల శివారులో హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద ఆగి ఉన్న ఢీకొట్టింది. ఈ ఘటనలో ఐచర్ వాహనంలోని డ్రైవర్ స్టీరింగ్ మధ్యలో ఇరుక్కుపోయాడు. జేసీబీ సహాయంతో డ్రైవర్‌ను బయటకు తీశారు. డ్రైవర్‌కు కాలు విరిగడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇదిలా ఉండగా ఐచర్ వాహనం పెట్రోల్ పంపు సమీపానికి రావడానికి ముందే తమిళనాడు నుంచి బోపాల్ వెళ్తున్న ఆయిల్ లారీని ఢీకొట్టి అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొన్నది. తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్‌ను 108 అంబులెన్స్‌లో ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాల్కొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరి జీవితం భరించలేక ఆత్మహత్య



కాశీ నగేశ్(ఫైల్)

లింగంపేట: తల్లితండ్రులు లేక ఒంటరి జీవితం గడుపుతున్న ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మత్తడి కిందిపల్లెలో శుక్రవారం చేసుకుంది. ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాశీ నగేశ్(20) తల్లితండ్రులు, సోదరి కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో నాటి నుంచి పెద్దనాన్న అయిన కాశీ చంద్రయ్య వద్ద ఉంటున్నాడు. నగేశ్ పెద్దనాన్నకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చి పెద్దనాన్నతో ఉంటున్నాడు. తల్లితండ్రులు లేని జీవితం ఇలా ఎన్ని రోజులు గడపాలంటు మనోవేదనకు గురై స్థానిక ఎల్లమ్మ ఆలయ సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి పెద్దనాన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అత్తను చంపిన కోడలు

- పొలం డబ్బుల విషయంలో గొడవ
- క్షణికావేశంలో గొంతునులిమి హత్య




విచారణ చేపడుతున్న పోలీసులు

బిచ్కుంద(జుక్కల్): పొలం డబ్బుల విషయంలో అత్తాకోడళ్ల మధ్య జరిగిన గొడవలో క్షణికావేశంలో అత్తను కోడలు గొంతు నులిమి హత్య చేసిన ఘటన మండలంలోని బండారెంజల్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలవ్వ విఠబోయి, కుమారుడు బాబు కోడలు అంజవ్వతో కలిసి ఉంటున్నారు. అత్తా కోడళ్ల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పొలానికి సంబంధించిన రూ. 48000 వచ్చాయి. తమ నగదును ఆడపడుచులకు ఖర్చు పెడుతున్నావని ఈ సారి పొలం డబ్బులు నాకు ఇవ్వాలంటు అత్తతో అంజవ్వ గొడవ పడింది. క్షణికావేశంలో అంజవ్వ అత్తను గొంతునులిమి హత్య చేసి వెళ్లిపోయింది. పొలం పనుల నుంచి ఇంటికి వచ్చిన మామ విఠబోయి తన భార్య బాలవ్వ ఊపిరి తీసుకోకపోవడాన్ని గుర్తించి పరిశీలించగా గొంతు నులిమి హత్య చేసినట్లు గుర్తించాడు. ఈ విషయమై కోడలిని నిలదీశాడు. వెంటనే పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి బాన్సువాడ సీఐ సత్యనారాయణ, ఎస్సై మోహన్‌రెడ్డి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

- క్షణికావేశంలో ఎలుకల మందు తాగిన భర్త
- పిల్లలకు తాగించిన వైనం



చికిత్స పొందుతున్న శ్రీకాంత్, సాత్విక, సహస్ర

కామారెడ్డి క్రైం: భార్యతో గొడవ కారణంగా క్షణికావేశానికి గురైన ఓ వ్యక్తి తాను తాగడమే కాకుండా ఇద్దరు కుమార్తెలకు ఎలుకల మందు తాగించాడు. ఈ ఘటన కామారెడ్డిలోని షేర్ గల్లీలో శుక్రవారం రాత్రి జరిగింది. ప్రస్తుతం వారు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన చల్ల శ్రీకాంత్ అనే వ్యక్తికి భార్య రాజ్యలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీకాంత్ చాలా రోజులుగా ఎలాంటి పని చేయకుండా తిరుగుతున్నాడు. అతని భార్య ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోంది. ఆర్థికంగా ఇబ్బందులు పెరగడంతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. శుక్రవారం సాయంత్రం వీరి మధ్య మరోసారి గొడవ జరిగింది. దీంతో క్షణికావేశానికి గురైన శ్రీకాంత్ ఎలుకల మందు నీటిలో కలిపి తాగేశాడు. ఆపై తన కుమార్తెలు సాత్విక, సహస్రలకు తాగించాడు. కుటుంబ సభ్యులు గమనించి వారిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. పట్టణ పోలీసులు విచారణ చేపడుతున్నారు.

చికిత్స పొందుతూ వీఆర్‌ఏ మృతి



మహేందర్ (ఫైల్)


డిచ్‌పల్లి: మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా గ్రామానికి చెందిన వీఆర్‌ఏ దాసరి మహేందర్ (35) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు నెలల క్రితం మహేందర్ అకస్మాత్తుగా కింద పడి కోమాలోకి వెళ్లాడు. మొదట జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో కుటుంబీకులు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య నవనీత, ముగ్గురు కుమారులు ఉన్నారు. గ్రామస్తులకు తలలో నాలుకలా మెలిగే మహేందర్ కోమాలోంచి బయటకు రాకుండానే మృతి చెందడంతో డిచ్‌పల్లిలో విషాదం నెలకొంది. ఇల్లు కట్టుకునేందుకు పోగు చేసుకున్న సుమారు రూ. 15 లక్షల నగదు అతడి చికిత్సకు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయింది. రెవెన్యూ అధికారులు అంత్యక్రియల కోసం రూ.10వేలు అందజేశారు. శుక్రవారం జరిగిన అంత్యక్రియల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో మహిళ..

ఆర్మూర్‌టౌన్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సుజాత(55) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 12న బస్టాండ్‌లో నిర్మల్‌కు చెందిన సుజాత ఆర్మూర్‌లో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వచ్చింది. బస్సు దిగి నడుచుకుంటు వెళ్తుండగా బస్సు ఢీకొన్నది. ఈ ఘటనలో ఆమె రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. దీంతో కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

తల్లి మందలించిందని..

- సెల్ టవర్ ఎక్కిన యువకుడు



నస్రుల్లాబాద్: ఇంట్లో జరిగిన గొడవలో తల్లి మందలించిందని ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కిన ఘటన మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శేఖర్ అతని భార్యతో గొడవ జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల శేఖర్‌ను తన భార్య నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో తీవ్రంగా గాయపరిచి మరో వ్యక్తితో వెళ్లిపోయిందన్నారు. ఈ విషయంలో నిజామాబాద్ రైల్వే, స్థానిక పీఎస్‌లో కేసు నమోదైందని గ్రామస్తులు తెలిపారు. ఈ క్రమంలో తన తల్లితో ఇంట్లో గొడవ జరగగా మందలించింది. దీంతో టవర్ ఎక్కి అందిరికి ఫోన్‌లో సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శేఖర్‌ను సముదాయించి కిందికి దిగేలా చేశారు. పీఎస్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

గుట్కా స్వాధీనం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని శాంతి టాకీస్ రోడ్డులోని ఓ కిరాణ దుకాణంలో గుట్కా నిల్వలు ఉంచినట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.1,14,216 విలువైన 18 రకాల 519 ప్యాకెట్ లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిషేదిత పొగాకు ఉత్పత్తులు, గుట్కాను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి కామారెడ్డి, చుట్టుపక్కల ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. ఈ కేసులో కొమిరిశెట్టి ప్రసాద్, సంతోష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ నాగేశ్వర్‌రావు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపయ్య, సిబ్బందిని ఎస్పీ సింధు శర్మ అభినందించారు.



గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుంటున్న

రిపోర్టర్‌పై కేసు నమోదు

నిజామాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీ కార్యదర్శిపై అసత్య ప్రచారాలు చేయడమే కాకుండా చంపుతానని బెదిరించిన ఓ రిపోర్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుండారం గ్రామానికి చెందిన ఓ రిపోర్టర్ ఆన్‌లైన్ పత్రికలో, యూట్యూబ్ చానళ్లలో పనిచేస్తున్నాడు. సదరు రిపోర్టర్ ఎన్నికల సమయంలో గ్రామ స్వాగత తోరణ సమీపంలో తాను నిర్వహిస్తున్న కిరాణషాపు వెనుక భాగంలో అక్రమంగా పిల్లర్లు వేసి గదిని నిర్మించాడు. ఈ విషయమై తహసీల్దార్‌కు జీపీ కార్యదర్శి ఫిర్యాదు చేశాడు. తహసీల్దార్ ఆదేశాల మేరకు మే 27న చేపట్టిన నిర్మాణ పనులను జేసీబీతో తొలగించారు. దీంతో సదరు రిపోర్టర్ జీపీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు చేపడుతూ చంపుతానని బెదిరింపు చర్యలకు పాల్పడ్డాడు. దీంతో జీపీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.